నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, మంగళవారం 29 ఏప్రిల్ 2025 | KHAMMAM


# రజతోత్సవం గ్రాండ్ సక్సెస్

- పాతికేళ్ల పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- 'సభ'కు వచ్చిన జనాన్ని చూసి కాంగ్రెస్ నేతల వెన్నులో వణుకు
- అడ్డంకులు సృష్టించినా ప్రభంజనాన్ని ప్రభుత్వం అడ్డుకోలేకపోయింది
- అక్కసుతోనే కాంగ్రెస్ విమర్శలు.. వచ్చేదిక బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- సర్కారుపై తీవ్ర వ్యతిరేకత: సండ్ర, మదన్‌లాల్, కొండబాల, లింగాల

ఖమ్మం, ఏప్రిల్ 28: వరంగల్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. పాతికేళ్ల పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాధాలు తెలుపుకుంటున్నామని అన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీవినీ ఎరుగని రీతిలో సభ జరిగిందని, ఉమ్మడి జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని పేర్కొన్నారు. ఎంతగానో ఎదురుచూసిన లక్షలాదిమంది ప్రజలు.. బీఆర్ఎస్ అధినేత, ఉద్యమసారథి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని ఆసాంతం విన్నారని అన్నారు. ఎండ తీవ్రతను లెక్క చేయకుండా కాలినడకన కూడా అభిమానులు సభకు చేరుకున్నారని, ప్రైవేట్ యాజమాన్యాల బస్సులు సభకు వెళ్లకుండా రవాణా శాఖ అధికారుల తో ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినా పార్టీ కార్యకర్తలు వాటిని అధిగమించి మరీ సభకు వచ్చారని వివరించారు. ఈ సభను చూసి కాంగ్రెస్ నేతల వెన్నులో వణుకు పుట్టిందని అన్నారు. ఓ మంత్రి తన స్థాయిని మరిచి.. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శించారని అన్నారు. అతడి వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ సభను చూసి ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన కాంగ్రెస్ నేతలు.. ఎదురుదాడి చేయడం విచారకరమని అన్నారు. దసరా రోజున పాలపిట్టను చూసిన ఆనందం.. కేసీఆర్‌ను చూడగానే సభకొచ్చిన ప్రజల ముఖాల్లో కన్పించిందని అన్నారు. కాంగ్రెస్ పాలనకు విసుగు చెందిన ప్రజలు.. సభ అయిపోయే వరకు ఓపికతో ఉన్నారని అన్నారు. ఎన్నికలెప్పుడొచ్చినా బీఆర్ఎస్ గెలుస్తుందనే నమ్మకం ఏర్పడిందని, రాబోయేదిక కేసీఆర్ సర్కారేనని స్పష్టం చేశారు. ఎల్కతుర్తి సభ కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోందని, కాంగ్రెస్ నేతల డైవర్షన్ పాలిటిక్స్‌కు కేసీఆర్ మీటింగ్ చెంపపెట్టులా ఉందని అన్నారు. కేసీఆర్ మీటింగ్ సక్సెస్‌ను తట్టుకోలేక అక్కసుతోనే మంత్రులు అవాకులుచవాకులు పేలుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉన్నంతకాలం కేసీఆర్ అనవాళ్లను ఎవరూ చెరిపేయలేరని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. హామీలు నెరవేర్చే వరకు కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని కేసీఆర్ చెప్పారని, ఆయన ఆదేశాల ప్రకారం ప్రభుత్వంపై పోరాడతామని అన్నారు. సభకు నాలుగు దిక్కులా 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడమే ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటుకు చిహ్నమని స్పష్టం చేశారు. జడ్పీ, డీసీసీబీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, పార్టీ నేతలు, ఉద్యమకారులు బెల్లం వేణుగోపాల్, బిచ్చాల తిరుమలరావు, మక్బూల్, గుండ్లపల్లి శేషగిరిరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, చిత్రంలో సండ్ర, లింగాల, కూరాకుల, కొండబాల, మదన్‌లాల్

**కొత్త రేషన్‌కార్డులు జనాన్ని పరేషాన్ చేస్తున్నాయి. ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు ఇవ్వాల్సిన రాష్ట్ర సర్కార్‌కు స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబానికి కొత్త రేషన్‌కార్డు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రజాపాలన సభలు ఏర్పాటు చేసి కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు స్వీకరించింది. కానీ ఇంతవరకు కొత్త రేషన్‌కార్డులు జారీ చేయకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే పథకాల అమలు కోసం మండలానికో పైలట్ గ్రామాన్ని ఎంచుకున్న కాంగ్రెస్ సర్కార్ అక్కడ కూడా పూర్తిస్థాయిలో ప్రజలకు న్యాయం చేయడం లేదు.** - భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ)

# రేషన్‌కార్డులు.. గందరగోళం

- తప్పులతడకగా మార్పులు.. చేర్పులు
- పైలట్ గ్రామాల్లో ప్రజలు అయోమయం
- కొత్త కార్డులు కోరుకున్నవారికి ఆశాభంగం
- డిలీట్ చేసిన పాపానికి పేర్లే గల్లంతు
- ప్రజాపాలన, మీ సేవలో ఆన్‌లైన్..
- రెండుసార్లు దరఖాస్తులతో సమస్య ఉత్పన్నం




కొత్తగా జారీ చేసిన రేషన్‌కార్డులో పేర్లు

పైలట్ గ్రామాల్లో కొన్ని రేషన్‌కార్డుల్లో అధికారులు మార్పులు.. చేర్పులు చేసినప్పటికీ అవన్నీ తప్పులతడకగా దర్శనమిస్తున్నాయి. జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన రాజబోయిన శ్రీను కుటుంబంలో ఏకంగా తొమ్మిది మంది పేర్లు ఒకే రేషన్‌కార్డులో వచ్చాయి. వీరు వేర్వేరు కుటుంబాలు అయినప్పటికీ అందరి పేర్లను అధికారులు ఒకే కార్డులో చేర్చారు. చింతలతండా గ్రామంలో రాములు అనే యజమాని రేషన్‌కార్డులో కొడుకు పేరు లేదు.. కానీ కోడలు, పిల్లల పేర్లు వచ్చాయి. ఇలాంటి ఘటనలు జిల్లా అంతా ఉండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. చింతలతండాకు చెందిన పాలూరి రాంబాబు కుటుంబంలో తల్లీ తండ్రితో కుమారులు ఉన్నారు. ఆయన కుమారుడు నరేష్ వేరే కార్డు కోసం దరఖాస్తు చేసుకుని తండ్రి కార్డులో పేరును డిలీట్ చేయించుకున్నాడు. తీరా కొత్త కార్డులో అతని పేరులేదు. భార్యాపిల్లల పేర్లు మాత్రం తండ్రి కార్డులో ప్రత్యక్షమయ్యాయి. అయితే కార్డులో ఉన్న పేర్లకు బియ్యం ఇవ్వడం లేదు. జిల్లాఅంతటా ఇలాంటి గందరగోళమే ఉండటంతో లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు.

### అటు ప్రజాపాలన.. ఇటు మీ సేవ

కొత్త సర్కారు రాగానే ప్రజాపాలన గ్రామసభలు ఏర్పాటు చేసి రేషన్‌కార్డులు లేనివారి నుంచి దరఖాస్తు తీసుకొని రసీదులు కూడా ఇచ్చారు. తర్వాత జనవరి 26న కొత్త రేషన్‌కార్డులకు మీ సేవలో ఆన్‌లైన్ చేసుకోమని సర్కార్ చెప్పడంతో మళ్లీ ఆన్‌లైన్ చేశారు. కానీ వాళ్లందరికీ రేషన్‌కార్డులు ఇచ్చినా అందులో పేర్లు లేకపోవడంతో అయోమయంలో పడ్డారు. జిల్లాలో ప్రజాపాలనలో 25,000 మంది దరఖాస్తులు చేసుకున్నారు. చేర్పులు.. మార్పుల కోసం ఆన్‌లైన్‌లో మరో 30వేల మంది దరఖాస్తులు ఇచ్చారు. ఇప్పటికీ అధికారులు మాత్రం 1,250 మాత్రమే కొత్త రేషన్‌కార్డుల పత్రాలు ఇచ్చారు. పైలట్ గ్రామాలకే కాకుండా అన్ని గ్రామాల్లో కొత్త వారి జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచారు. అవీ తప్పులతడకలుగా ఉన్నట్లు అధికారులు కూడా ధ్రువీకరించారు. గతంలో పాతవి 2.93 లక్షల కార్డులు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెప్తున్నారు.



### కొత్తకార్డు కోసం పేరు డిలీట్ చేశా..

మొన్నటివరకు మా నాన్నకార్డులో నా పేరు ఉండేది. నాకు పెళ్లియింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు ఇచ్చాను. మీ సేవలో కూడా ఆన్‌లైన్ చేశాను. కొత్తగా మా నాన్న కార్డులో నా భార్యపిల్లల పేర్లు కలిపారు. కానీ నాకు కొత్తకార్డు ఇవ్వలేదు. నా పేరు అందులో లేదు. భార్యాపిల్లలకు బియ్యం ఇవ్వడం లేదు. కొత్త కార్డు ఇస్తారా మళ్లీ ఇలానే జరుపులు పెడతారా అర్థంకావడం లేదు.

**– పాలూరి నరేష్, కాకర్ల, జూలూరుపాడు మండలం**



### నా పేరు డిలీట్ కాలేదు

మా కుటుంబానికి పాత కార్డు ఉంది. నాకు పెళ్లి అయ్యింది. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నా పేరు డిలీట్ కాలేదు. భార్య ముగ్గురు పిల్లల పేర్లు ఆన్‌లైన్‌లో వచ్చాయి. కొత్త కార్డు ఎప్పుడు ఇస్తారో తెలియదు. అందరి పేర్లు ఒక దానిలో ఉన్నట్లు ఆన్‌లైన్ పేపరు ఇవ్వమంటే ఇవ్వడం లేదు. సరిచేస్తామని చెప్తున్నారు.

**– ధర్మసోత్ నరేష్, చింతల్‌తండా, జూలూరుపాడు మండలం**

### లోపాలను సరిచేస్తున్నారు..

అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు వస్తాయి. సాంకేతిక సమస్య వల్ల పేర్లు యాడింగ్ అయ్యాయి. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులు, మీ సేవలో ఇచ్చిన దరఖాస్తులు ఒకటే అయ్యాయి. రెండుసార్లు దరఖాస్తులు చేయడం వల్ల సమస్య వచ్చింది. ఆధార్ డేటా సరిచేస్తున్నారు. లోపాలను సరిచేసి కొత్త రేషన్‌కార్డులను త్వరలోనే జారీ చేస్తాం. కొత్త కార్డులు జారీ చేశాక రేషన్ బియ్యం వస్తాయి.

**– రుక్మిణి, సివిల్ సప్లై అధికారి, భద్రాద్రి కొత్తగూడెం**

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వద్దా?

- మాకు ఇళ్లు ఇవ్వకుంటే చావే శరణ్యం
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన గుర్రాలచెరువు మహిళలు
- అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే రద్దు చేస్తాం: మంత్రి పొంగులేటి



తమకు ఇళ్లు రాలేదంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గుర్రాలచెరువు గ్రామానికి చెందిన మహిళలు

అశ్వారావుపేట, ఏప్రిల్ 28 : 'గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయరా..? డబ్బున్న వాళ్లకే ఇళ్లు ఇస్తారా.? మాకు ఇళ్లు రాకుంటే చావే శరణ్యం.. పేదలకు ఇళ్లు ఇవ్వకుండా మా గ్రామానికి ఎవరు ఎలా వస్తారో చూస్తాం..' అంటూ అశ్వారావుపేట మండలం గుర్రాలచెరువు గ్రామానికి చెందిన మహిళలు సవాల్ విసిరారు. సోమవారం భూభారతి చట్టం అవగాహన సదస్సుకు హాజరైన గుర్రాలచెరువు గ్రామానికి చెందిన పలువురు మహిళలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో.. ఆ కార్యక్రమం పూర్తయిన వెంటనే మహిళలు కొంత దూరం మంత్రి వెనుకే వెళ్లారు. అయినా మంత్రి కలవకపోవడంతో అధికారులు, కాంగ్రెస్ నేతల తీరుపై మహిళలు కలపాల పుష్ప, సరస్వతి, మరియమ్మ, సొంగ లక్ష్మి మండిపడ్డారు. ఈ నాయకులకు పేదల కంటే డబ్బున్నోళ్లే ముఖ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా ప్రజా ప్రభుత్వం? ఇందిరమ్మ రాజ్యం? అంటూ ప్రశ్నించారు.

### హామీల్లో కొన్నింటినే అమలు చేశాం..

**అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే రద్దు చేస్తాం..: మంత్రి పొంగులేటి**

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో కొన్నింటినే అమలు చేశామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. తొలుత మండలంలో పర్యటించిన మంత్రి మండల పరిషత్ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం-2025 రైతు అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మొదటి విడతలో స్థలాలు ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఇందిరమ్మ కమిటీలు కూడా అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేస్తే అధికారులు రద్దు చేస్తారని, ఈ విషయంలో కమిటీ బాధ్యులు నొచ్చుకోవద్దని సున్నితంగా హెచ్చరించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్, హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

# తరుగు లేకుండా ధాన్యం కొనాలి..

- ఖమ్మం జిల్లా వైరా ఏఎంసీ ఎదుట రైతుల ఆందోళన
- మద్దతు తెలిపిన రైతు సంఘాలు, బీఆర్ఎస్, వివిధ పార్టీల నాయకులు

వైరా టౌన్, ఏప్రిల్ 28 : తరుగు తీయకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైరా వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు రైతు సంఘాలు, బీఆర్ఎస్, వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు భాగం హేమంతరావు, బొంతు రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు రైస్ మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉందన్నారు. వైరా మార్కెట్‌లో 20 రోజుల నుంచి ధాన్యం రాశులు పోసి కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, క్వింటాకు 5 కేజీల చొప్పున తరుగు తీయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో ఉన్న జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. కాగా.. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ముజామిల్ ఖాన్, ఎస్సై భాగ్యరాజ్ అక్కడికి చేరుకొని రైతులతో చర్చలు జరిపారు. విషయాన్ని జిల్లా అధికారులు దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, తరుగు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షుడు మల్లెంపాటి రామారావు, రైతులు హరివెంకటేశ్వరరావు, ఎస్‌కే సైదులు, కామినేని రవి, బెజవాడ నాగేశ్వరరావు, బీఆర్ఎస్, వివిధ పార్టీల నాయకులు భూక్యా వీరభద్రం, దండి సురేశ్, సింగ్ నరసింహారావు, జితేంద్రరెడ్డి, తోట రామాంజనేయులు, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.



వైరా వ్యవసాయ మార్కెట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

# పట్టా పాస్ బుక్‌పై నక్షా ముద్రణ

**భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

దమ్మపేట రూరల్, ఏప్రిల్ 28: భూభారతి చట్టం ప్రకారం.. కొత్తగా ఇచ్చే పాస్ పుస్తకాలపై భూమి నక్షా ముద్రణ ఉంటుందని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. భూభారతి చట్టంపై దమ్మపేట మండలంలోని మల్లారం రైతు వేదికలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ధరణి పాస్ పుస్తకాలు ఉన్న వారికి ఇబ్బంది ఉండదన్నారు. ఇకపై వచ్చే సమస్యలను భూభారతి చట్టంతో వేగంగా పరిష్కరిస్తామని అన్నారు. ఆర్డీవో మధు, ఎంపీడీవో రవీంద్రరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ వాణి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**సేవ్ కొత్తగూడెం-సేవ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా**



నిరసన వ్యక్తం చేస్తున్న స్థల యజమానులు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 28 : ఇళ్లు నిర్మించుకునేందుకు అర్హులైన నిరుపేదలను గుర్తించి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సేవ్ కొత్తగూడెం-సేవ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట స్థల యజమానులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కన్వీనర్ జలాల్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులలో నిరుపేదలను గుర్తించి 807 మందికి 75 గజాల చొప్పున ప్రభుత్వం పాత కొత్తగూడెంలో స్థలాన్ని మంజూరు చేసిందని, వారందరూ ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వార్డుల్లో మాజీ కౌన్సిలర్ల పెత్తనం ఎక్కువైందని, వారే తమకు అనుకూలంగా ఉన్న వారిని లబ్ధిదారులుగా గుర్తిస్తున్నారని, ఈ అంశంపై కలెక్టర్ విచారణ చేపట్టాలన్నారు. అలాగే రామవరం ప్రాంత ప్రజలకు ఇండ్ల క్రమబద్ధీకరణ పట్టాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, ఎమ్మెల్యే ఈ అంశంపై దృష్టి సారించాలని ఆయన కోరారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ ప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

## నేటి నుంచి 'ఎప్‌సెట్'

- ఫార్మసీ పరీక్షకు 7, ఇంజినీరింగ్‌కు 6 కేంద్రాలు
- ఉమ్మడి జిల్లాలో రెండు సెషన్లలో పరీక్ష నిర్వహణ

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 28 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో చేరికలకు ఎప్‌సెట్ పరీక్షలు ఈ నెల 29, 30, మే 2 నుంచి 4వ తేదీ వరకు జరుగనున్నాయి. రోజుకు రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెషన్-1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెషన్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణ కోసం ఖమ్మం జిల్లాలో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 7 కేంద్రాలు, ఇంజినీరింగ్‌కి 6 కేంద్రాలను ఎంపిక చేశారు. 29, 30 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలు, మే 2 నుంచి 4వ తేదీ వరకు ఇంజినీరింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెంలో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి ఒక కేంద్రాన్ని, ఇంజినీరింగ్‌కు రెండు కేంద్రాలను ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లాలో ఇంజినీరింగ్ పరీక్షకు 8,037 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షకు 3,837 మంది హాజరుకానున్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఇంజినీరింగ్ పరీక్షకు 778 మంది, అగ్రికల్చల్ అండ్ ఫార్మసీ పరీక్ష 388 మంది రాయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలి

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెనుబల్లి, ఏప్రిల్ 28 : రైతులు విక్రయానికి తరలించిన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేయాలని, వెనువెంటనే ఆ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. రామచంద్రరావు బంజర గ్రామంలో దుర్గా గ్రామ సమాఖ్య-ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేకరించిన ధాన్యం లారీలకు లోడ్ చేసే ప్రక్రియ, రిజిస్టర్ల నమోదు, తేమ శాతం, గన్నీ బ్యాగుల లెక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, ప్రతి కేంద్రంలో బోర్డు ఏర్పాటు చేసి ఇప్పటివరకు టార్పాలిన్ పట్టాలు, గన్నీ బ్యాగులు ఎన్ని ఉన్నాయో స్పష్టమైన వివరాలు ప్రదర్శించాలని ఆదేశించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో ముచ్చటించారు. తేమ సరిగా వచ్చిన ధాన్యాన్ని రైతులు తీసుకొస్తే కిలో కూడా తరుగు లేకుండా పూర్తి ధర అందిస్తామని తెలిపారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది? ఎంత మొత్తాన్ని మిల్లులకు పంపించారు? అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తరలింపు సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల సమస్య తలెత్తకుండా ముందుస్తు ప్రణాళికలు ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పెనుబల్లి తహసీల్దార్ గంటా ప్రతాప్‌రెడ్డి, ఎంపీవో ఉపేంద్రయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు నరేశ్, ఏపీఓ జ్యోతి ప్రసన్న, రైతులు, అధికారులు పాల్గొన్నారు.


శ్రద్ధాంజలి



జననం : 1938
మరణం : 20-04-2025
కీ.శే. పసుపులేటి సత్యం గారు
రిటైర్డ్ టీచర్
కుటుంబ సభ్యులు ... బంధుమిత్రులు
పెద్దకర్మ : రేపు ది.30-04-2025 బుధవారం రోజున మా స్వగృహం సువర్ణాపురం గ్రామం, ముదిగొండ మండలం నందు జరుగును.
గమనిక : కార్డు అందని వారు ఈ ప్రకటననే కార్డుగా భావించి రాగలరు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616